క్లుప్తంగా

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కన్నాల బస్తీలో భూ కబ్జాకు పాల్పడిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ మాజీ కౌన్సెలర్ పొట్ల సురేష్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు అమానుల్లాఖాన్, ఉపాధ్యక్షుడు అంబాల మచ్చయ్య కోరారు. బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ, ఏసీపీ రవికుమార్‌కు సోమవారం వినతిపత్రాలు అందజేశారు.

ఆలయానికి పోటెత్తిన భక్తులు

మంచిర్యాలఅర్బన్: శ్రావణం చివరి రోజు సోమవారం, పొలాల అమావాస్య కావటంతో స్థానిక విశ్వనాథ ఆలయానికి భక్తులు పోటెత్తారు. శివాలయంలో అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజల్లో భక్తులు తరలివచ్చారు. కొండ పద్మ, చంద్రశేఖర్ అన్నదానం చేపట్టారు. ఆలయ ఈవో ముక్తారవితో పాటు పలువురు పాల్గొన్నారు.

కార్మిక కాలనీల్లో వైద్య సేవలు

మందమర్రిరూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని కార్మిక కాలనీల్లో వైద్య సిబ్బంది శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణంలోని రెండవ జోన్‌లోని ఉమా మాధవరెడ్డి అనే కార్మికుడి ఇంటి వద్ద సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేయగా సమీపంలోని ప్రజలు వైద్య సేవలు వినియోగించుకున్నారు. ఏఎస్ఎం పద్మావతి, జ్యోతి, ఆశా వర్కర్ లక్ష్మి ఉన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం

కోటపల్లి: మండలంలోని సుపాక గ్రామానికి చెందిన చెన్నూరి శృతి అనే గర్భిణికి పురిటినొప్పులు రాగా 108అంబులెన్స్‌కు సమాచారం అందించారు. 108అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ఆసుపత్రికి తరలిస్తుండగా పురిటినొప్పులు అధికం కావడంతో జనగామ గ్రామానికి సమీపంలో శృతి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ ఇద్దరు క్షేమంగానే ఉన్నారు. మెరుగైన వైద్యసేవల కోసం చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈఎంటీ శబాజ్, పైలెట్ సతీశ్ ఉన్నారు.

లాభాల వాటా చెల్లించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్/మందమర్రిరూరల్/బెల్లంపల్లిరూరల్(తాండూర్)/కాసిపేట: సంస్థకు వచ్చిన లాభాల్లో నుంచి సింగరేణి కార్మికులకు లాభాల వాటా చెల్లించాలని కోరుతూ మందమర్రి ఏరియాలోని ఆర్‌కేపీ సివిల్ కార్యాలయంలో సోమవారం టీబీజీకేఎస్ నాయకులు జేఈ దేవకుమార్‌కు వినతిపత్రం అందించారు. మందమర్రి ఏరియాలోని కేకే-5 గనిపై ఆందోళన నిర్వహించి గని మేనేజర్ ప్రవీణ్ పాతిన్‌కు వినతిపత్రం అందించారు. సివిల్ కార్మికుల సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. బెల్లంపల్లి ఏరియా స్టోర్ డిపార్ట్‌మెంట్ కార్యాలయంలో స్టోర్ డీవై ఎస్ఈ నాగభూషణంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ పిట్ కార్యదర్శి దబ్బేటి సంతోష్, టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజశేఖర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

'పారిశుధ్య పనుల్లో వివక్ష వీడాలి'

బెల్లంపల్లిరూరల్(తాండూర్): మాదారం టౌన్‌షిప్‌లో సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టడంలో వివక్షతను వీడాలని మాదారం కాంగ్రెస్ పార్టీ నాయకుడు కుశ్నపల్లి లక్ష్మణ్ అన్నారు. మాదారం టౌన్‌షిప్ సింగరేణి సివిల్ సూపర్‌వైజర్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ మాట్లాడుతూ.. టౌన్‌షిప్‌లోని పలు వార్డుల్లో పారిశుధ్య పనులు చేపట్టడంలో కాంట్రాక్ట్ సూపర్‌వైజర్ సంతోశ్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. పూర్తి స్థాయిలో పనులు చేపట్టకపోవడంతో వార్డు కార్మికులు, కార్మికేతరులు దోమలు, పారిశుధ్య లోపంతో ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రతీ వార్డులో వివక్షత లేకుండా పారిశుధ్య పనులు చేపట్టేలా చొరవ తీసుకోవాలని కోరారు.

శ్రీనివాసరావుకు ఎమ్మెల్యే పరామర్శ

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు పూసూరి శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యం బారి నుంచి కోలుకోగా సోమవారం ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు పరామర్శించారు.



దంచికొట్టిన వాన

- పొంగిన వాగులు, వంకలు
- కాలనీలు జలమయం
- పలుచోట్ల రాకపోకలకు, విద్యుత్ సరఫరాకు అంతరాయం
- ఇబ్బంది పడ్డ ప్రజలు
- లోతట్టు ప్రాంతాలను సందర్శించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

జిల్లా వ్యాప్తంగా సోమవారం కూడా వర్షం దంచికొట్టింది. గోదావరి, ప్రాణహిత నదులు ఉధృతంగా ప్రవహించాయి. వాగులు, ఒర్రెలు, చెరువులు ఉప్పొంగాయి. పంట పొలాలు నీటమునిగాయి. పలుచోట్ల కాలనీలు జలమయం అయ్యాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు లోతట్టు ప్రాంతాలను సందర్శించి పలు సూచనలు చేశారు. కొన్నిచోట్ల యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు.

జన్నారం.. జలమయం



వాగు ఉధృతిని పరిశీలిస్తున్న అధికారులు

జన్నారం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి జన్నారం మండలం జలమయం అయింది. పోలీస్‌స్టేషన్ సమీపంలో గల వాగు ఉప్పొంగడంతో ఆదివారం రాత్రి వాగు సమీపంలోని బుడగ జంగాల కాలనీలోకి నీరు చేరింది. వారు ఇళ్లను ఖాళీ చేసి సమీపంలోని పాఠశాలలో తలదాచుకున్నారు. రోటిగూడ గ్రామానికి వెళ్లే దారిలో ఒర్రె ఉప్పొంగి రోడ్డు పైనుంచి పారడంతో రాకపోకలు నిలిచిపోయాయి. లోత్రొర్రె వాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో గ్రామస్తులు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. కొత్తపేట గ్రామం కొత్త చెరువు తెగిపోవడంతో నీరు దిగువన గల బర్తన్‌పేట్ చెరువులోకి చేరడంతో చెరువు సమీపంలోని హరిజన కాలనీలోకి నీరు చేరింది. వరద దాటికి పొలాలు, పత్తి పంటలో ఇసుక మేటలు వేశాయి. తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఎంపీడీవో శశికళ, ఎస్సై రాజవర్ధన్ సోమవారం రోటిగూడ, పొనకల్ బుడుగ జంగాల కాలనీల్లో పర్యటించారు. మండలంలో ఎలాంటి నష్టం జరగలేదని పేర్కొన్నారు. కవ్వాల్‌లోని హరిజన వాడలో పైన చెరువులకు గండి పడటంతో నీరు కిందికి ప్రవహించి పొలాల్లో చేరాయి. పంట నీటిలో మునిగడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు.

తెగిన రోడ్లు..



రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

చెన్నూర్: మున్సిపాలిటీ పరిధిలో భారీ వర్షాల కారణంగా 7వ వార్డు పరిధిలోని ఒడ్డెపల్లికి వెళ్లే దారిలో గల రోడ్డు తెగిపోయింది. 16వ వార్డులో గల రోడ్డు వర్షాలకు కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెంటనే స్పందించిన కౌన్సిలర్లు జగన్నాథుల శ్రీనివాస్, తుమ్మ రమేశ్‌లు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో మున్సిపల్ కమిషనర్ గంగాధర్, చైర్‌పర్సన్ అర్చన రాంలాల్‌గిల్డాలు దగ్గరుండి యుద్ధ ప్రతిపాదికన రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టారు.

ప్రమాదకరంగా కాజ్‌వే

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్ గ్రామం నుంచి అక్కెపల్లి గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలోని వాగుపై ఉన్న లోలెవల్ కాజ్‌వే పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని కూలుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు కాజ్‌వే పూర్తిగా కూలిపోతే వాగు దాటడం కష్టంగా మారుతోంది.

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

పాతమంచిర్యాల: భారీ వర్షాల కారణంగా గోదావరి వరద నీటి ఉధృతి పెరుగుతుండడంతో వరద ముంపు ప్రాంతాలైన జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్, రాంనగర్, బృందావన్ కాలనీ, మాతా శిశు ఆస్పత్రి ప్రాంతాలను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్ రావు, జిల్లా కలెక్టర్ కుమార్‌దీపక్ అధికారులతో కలిసి పర్యటించారు. గోదావరి నీటిమట్టం పెరుగుతున్నందునా, ముందు జాగ్రత్తగా మాతాశిశు ఆరోగ్య కేంద్రంలోని బాలింతలు, గర్భిణులను జిల్లా ఆస్పత్రికి తరలించాలని అధికారులకు సూచించారు. పలువురికి భవన నిర్మాణ కార్మిక సంఘం భవనంలో పునరావాసం కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్‌రాజ్, మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్, పోలీస్ అధికారులు, ఉన్నారు.



నస్పూర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నస్పూర్: కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టుల గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్న నేపథ్యంలో పట్టణ పరిధిలోని గోదావరి పరివాహక లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. పట్టణం లోని వినూత్న కాలనీలో సోమవారం పర్యటించారు.

వరద ప్రాంతాల పరిశీలన

జైపూర్: మండలంలో వర్షాలకు పంట పొలాలు, గోదావరి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వేలాల, పొనూర్ శివ్వారం, కిష్టాపూర్, గోదావరి తీర ప్రాంతాలను తహసీల్దార్ వనజారెడ్డి, ఎస్సై శ్రీధర్, ఎంపీడీవో సత్యనారాయణ సందర్శించారు. ఐదు ఇళ్లు పాక్షికంగా కూలాయి.

వాగుల పరిశీలన

నెన్నెల: మండలంలోని లంబాడితండా ఎర్రవాగు, దమ్మిరెడ్డిపేట మత్తడి వాగులను అధికారులు సందర్శించారు. ఎర్రవాగు కల్వర్టు, దమ్మిరెడ్డిపేట వాగుల వరద ప్రవాహాన్ని తహసీల్దార్ రమేశ్, ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌లు, సిబ్బందితో కలిసి పరిశీలించారు.

నీటమునిగిన రైల్వే అండర్ బ్రిడ్జి




మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని హైటెక్ సిటీ వెనుకాల ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి నీట మునిగింది. వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో 5కిలోమీటర్ల దూరం నుంచి తిరిగి మంచిర్యాల పట్టణ కేంద్రానికి వెళ్లాల్సి వచ్చిందని రాజీవ్‌నగర్ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

నేలకూలిన ట్రాన్స్‌ఫార్మర్

మంచిర్యాలఅగ్రికల్చర్: భారీ వర్షాల ప్రభావంతో కన్నెపల్లి మండలం జంగంపల్లిలో విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు ఎస్ఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు.

నిండుకుండలా గోదావరి



దండేపల్లి: గూడెం వద్ద గోదావరి ఉధృతి

చెన్నూర్/కోటపల్లి/దండేపల్లి: ఎల్లంపల్లి, కడెం ప్రాజెక్టుల గేట్లు తెరువడంతో గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. వర్షాలకు వాగులతో పాటు ప్రాణహిత నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. కోటపల్లి మండలంలోని పార్‌పల్లి, ఎర్రాయిపేట, కొల్లూర్, రాంపూర్ గ్రామాల వద్ద, దండేపల్లి మండలం గూడెం వద్ద, చెన్నూర్‌లో గోదావరి నది నిండుకుండలా ప్రవహిస్తోంది. కోటపల్లి కొత్తపల్లి రాజారం, దేవులవాడ గ్రామాల మధ్య వాగు ఉప్పొంగి ప్రవహించడంతో గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. నక్కలపల్లి వెళ్లేదారిలో లోత్రొర్రెవాగు ఉప్పొంగి ప్రవహించడంతో తాత్కాలిక వంతెన పూర్తిగా కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో గ్రామానికి వెళ్లకుండా ఉండేందుకు రహదారుల భవనాలశాఖ ఆధ్వర్యంలో వాగుకు అడ్డుగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలో వాహనాలు వెళ్లేందుకు వీలులేకుండా చేశారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

మరమ్మతు పనుల పరిశీలన

బెల్లంపల్లిరూరల్: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీలో ఇటీవల కురిసిన వర్షానికి రోడ్డు తెగిపోగా మరమ్మతు పనులు ప్రారంభించారు. పనులను జెడ్పీ సీఈవో గణపతి, మండల ప్రత్యేక అధికారి సీహెచ్ దుర్గాప్రసాద్, పంచాయతీ రాజ్ డీ.ఈ రవీందర్, ఎంపీడీవో మహేందర్ సోమవారం పరిశీలించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

ప్రాణహితకు వరద ఉధృతి

వేమనపల్లి: ఎగువ ప్రాంతాల్లోని మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు భారీ వర్షాలతో ప్రాణహిత నదిలోకి ఉధృతంగా వరద ప్రవహిస్తోంది. పెనుగంగా వార్ధా, వైన్‌గంగా నుంచి వచ్చే వరద తీవ్రత ఎక్కువగా ఉంది. దిగువన గోదావరి నదిలో వరద తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రాణహితకు వరద ముంపు అధికంగా ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పుష్కరఘాట్ పూర్తిగా మునిగిపోగా, రోడ్డుపైకి ముంపు నీరు వచ్చి చేరింది. సరిహద్దులో తెలంగాణ-మహారాష్ట్ర వైపు నడిచే నాటుపడవల రాకపోకలు నిలిపివేశారు. మంగళవారం లోతట్టు ప్రాంతాల్లో ఉన్న పంట చేళ్లకు మళ్లీ వరద అధికమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

రోడ్డు డ్యాం పరిశీలన

భీమారం: భీమారం-నెన్నెల ప్రధాన రహదారిలోని నర్సింగాపూర్ వద్ద గల రోడ్డు డ్యాంను సోమవారం తహసీల్దార్ సధానందం సందర్శించారు. అనంతరం గొల్లవాగు ప్రాజెక్టుని ఆయన పరిశీలించారు. వర్షాల కారణంగా ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు.

ఘనంగా పొలాల అమావాస్య



చెన్నూర్ శివాలయంలో పూజలు

దండేపల్లి: మండల కేంద్రంలో సోమవారం నేతకాని సంఘం ఆధ్వర్యంలో పొలాల అమావాస్య వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఎద్దులకు పూజలు చేసి, సంఘ నాయకులు, ఎద్దులతో కలిసి బ్యాండు మేళాలతో, ఊరేగింపు నిర్వహించారు.



దండేపల్లి: ఎద్దులతో నేతకాని కులస్తుల ర్యాలీ

చెన్నూర్: పట్టణ ప్రజలు పొలాల అమావాస్య పండగను ఘనంగా జరుపుకున్నారు. రైతులు ఎద్దులు, ఆవులను అలంకరించి పూజలు చేశారు. శివాలయంలో అర్చకులు మహేశ్వర్‌శర్మ, హిమకర్‌శర్మ ఆధ్వర్యంలో ఆవులకు ప్రత్యేక పూజలు చేశారు.

ఎడ్ల పండుగ రోజే విషాదం

- విద్యుదాఘాతంతో ఒకటి, నీటిలో కొట్టుకుపోయి మరొక ఎద్దు మృత్యువాత

వేమనపల్లి/దండేపల్లి: ఎడ్ల పండుగ రోజే వేమనపల్లి మండలం కేతన్‌పల్లిలో, దండేపల్లి మండలం ద్వారక గ్రామాల్లో ఇద్దరు రైతుల ఇంట విషాదం నెలకొంది. మునిమడుగుల సతీశ్(ద్వారక) అనే రైతుకు గల ఎడ్లను పొలాల అమావాస్య సందర్భంగా సోమవారం గోదావరినది సమీపంలో ప్రవహించే వాగు నీటిలో కడిగేందుకు తీసుకెళ్లగా, ప్రమాదవశాత్తు వాగులో కొట్టుకుపోయి ఒక ఎద్దు మరణించింది. ఎద్దు విలువ రూ.30వేలు ఉంటుందని పేర్కొన్నాడు. మేత మేపేందుకు బయటకు తీసుకెళ్లగా మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తాకడంతో విద్యుదాఘాతానికి గురై ఒక ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.60 వేలు ఉంటుందని రైతు వాపోయాడు. వ్యవసాయ పనులు ఊపందుకున్న సమయంలో ఎడ్లు మృతి చెందడంతో ఎవుసం ఎట్ల సాగుతుందని రైతులు కన్నీరుమున్నీరుగా విలపించారు. నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.



వేమనపల్లి: చనిపోయిన ఎద్దు వద్ద రైతు, గ్రామస్తులు

వైఎస్సార్ సేవలు మరువలేనివి



బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

- ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి

బెల్లంపల్లి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు సోమవారం బెల్లంపల్లిలో ఘనంగా నిర్వహించారు. పట్టణ కాంగ్రెస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. పేద ప్రజల కోసం రాజశేఖర్ రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశారన్నారు. వైఎస్సార్ పరిపాలన స్వర్ణయుగంగా గడిచిందని, ఆ మహనీయుడి అకాల మరణం ఉమ్మడి రాష్ట్ర ప్రజలకు తీరని లోటుగా మిగిలిందన్నారు. వైఎస్సార్ ఆశయాలను తుదివరకు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు సీ.హెచ్.శంకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య, మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు చిన్నరాజం, రాజలింగు, అన్వర్ ఖాన్, పలువురు మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జన్నారం: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

జన్నారం: మండల కేంద్రంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, రాష్ట్రానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు రియాజోద్దీన్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు శుభాష్‌రెడ్డి, ముత్యం రాజన్న, ఫసీఉల్లా, రజాక్, మోసిన్‌ఖాన్, తిరుపతి నాయక్, గంగన్న యాదవ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్ఆర్ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, టీపీసీసీ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి, సాగర్‌రెడ్డి, శ్యాంగౌడ్, పలిగిరి కనకరాజు, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



చెన్నూర్: వైఎస్ చిత్ర పటానికి నివాళులర్పిస్తూ...

చెన్నూర్: చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చెన్నూరి శ్రీధర్, బషీరోద్దీన్, పాతర్ల నాగరాజు, అన్వర్, లింగంపల్లి మహేశ్, హజు, ముత్తు, వసీం, కరీం తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలో వైఎస్సార్ వర్ధంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, వైద్య సిబ్బందికి కాంగ్రెస్ నాయకులు పండ్లు పంపిణీ చేశారు.

సంక్షిప్త వార్తలు

రిటైర్డ్ ఉద్యోగులకు సన్మానం

శ్రీరాంపూర్: జీఎం కార్యాలయంలోని ఐటీ భాగంలో పనిచేసి రిటైర్డ్ అయిన జనరల్ మజ్దూర్ రాజేశ్వరిని సోమవారం జీఎం కార్యాలయంలో ఏరియా ఎస్ఓటూజీఎం సత్యనారాయణ సత్కరించారు. ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, పీఎం రాజేశ్వర్, సీనియర్ పీవో కాంతారావు, ఐటి అధికారి శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీ రామచందర్ పాల్గొన్నారు. ఎస్అండ్‌పీసీ సెక్యూరిటీ విభాగంలో రిటైర్డ్ అయిన కనకయ్యను సన్మానించి వీడ్కోలు పలికారు.

పీహెచ్‌సీ పరిశీలన

కాసిపేట: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం బెల్లంపల్లి డివిజన్ డెప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ సందర్శించి రికార్డులు పరిశీలించారు.

వీధి కుక్కల పట్టివేత

మందమర్రిరూరల్: పట్టణంలో కొంత కాలంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న కుక్కల బెడద నుంచి కాపాడదానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. సోమవారం కుక్కలను పట్టే వారిని పిలిపించి కుక్కలను పట్టి వాహనంలో తీసుకెళ్లారు.

ఎస్ఓటుజీఎంకు సన్మానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా నూతన ఎస్ఓటుజీఎంగా బాధ్యతలు చేపట్టిన యన్. సత్యనారాయణను సింగరేణి మున్నూరుకాపు ఉద్యోగులు సంఘం నాయకులు సోమవారం ఘనంగా సన్మానించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

రామకృష్ణాపూర్: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్టణ ఎస్సై రాజశేఖర్ అన్నారు. తెలంగాణ బలహీనవర్గాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్లో డ్రగ్స్ వ్యతిరేక పోస్టర్లను ఆవిష్కరించారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మోతె రాజలింగు, సాయి, వెంకటస్వామి, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

బెల్లంపల్లిరూరల్: మండలంలోని బుధాకుర్దు గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచందర్ లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు.

సమస్య పరిష్కరించాలని వినతి

కాసిపేట: మండలంలో శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ భవనాల సమస్య పరిష్కరించాలని బీజేపీ మండల అధ్యక్షుడు సూరం సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో సత్యనారాయణసింగ్‌కు వినతిపత్రం అందజేశారు.